క్లుప్తంగా

మోపిదేవి ఎస్‌ఐగా వీర వెంకట సత్యనారాయణ బాధ్యతల స్వీకరణ

మోపిదేవి: మోపిదేవి ఎస్‌ఐగా కె. వీర వెంకట సత్యనారాయణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. తొలుత స్థానిక శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. మచిలీపట్నం తాలూకా పోలీస్‌స్టేషన్ నుంచి బదిలీపై మోపిదేవికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న సీహెచ్ పద్మ మచిలీపట్నం తాలూకా పీఎస్‌కు బదిలీ అయ్యారు.

● **అవనిగడ్డ:** మోపిదేవి ఎస్‌ఐ సత్యనారాయణ డీఎస్పీ మురళీధర్‌ని స్థానిక డీఎస్పీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

అయ్యప్పల ప్రత్యేక పూజలు

పెడన: శ్రీగంగాపార్వతీ సమేత ఆగస్తేశ్వర స్వామి దేవస్థానం ప్రాంగణంలోని శ్రీహరిహర సుత అయ్యప్పస్వామి దేవస్థానం వద్ద 21వ మండల పూజ మహోత్సవాలు పురస్కరించుకుని బుధవారం అయ్యప్ప దీక్షాధారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నెల 17న శ్రీలక్ష్మీగణపతి పూజతో ప్రారంభమైన మండల పూజలు డిసెంబరు 27వ తేదీ వరకు జరుగుతాయని అయ్యప్ప భక్తబృందం పేర్కొంది. పండితులు గూడూరు శివదత్త హరి హరసూతన్ అయ్యప్ప స్వామికి పూజలు చేయించారు. అనంతరం అయ్యప్పలు, శివ భక్తులకు, భవానీ దీక్షాధారులకు సద్ది ఏర్పాటు చేశారు. డిసెంబర్ 1న దివ్యపడిపూజ జరుగుతుందని తెలిపారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి వెండి చెంబు సమర్పణ

మోపిదేవి: స్థానిక శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి హైదరాబాద్ వాస్తవ్యులు వల్లంకొండ యశ్వంత్ దంపతులు వెండితో తయారు చేసిన చెంబును బుధవారం సమర్పించారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం ఆలయ అధికారికి వెండి చెంబు అందజేశారు. 182 గ్రాముల వెండి.. సుమారు రూ. 14 వేలతో తయారు చేయించిన చెంబును స్వామివారికి సమర్పించుకున్నట్లు తెలిపారు. దాతలను ఆలయ మర్యాదతో సత్కరించారు.

పిట్టల్లంక మాజీ సర్పంచి వెంకటరమణ మృతి

కోడూరు: మండలంలోని పిట్టల్లంక మాజీ సర్పంచి, బడేవారిపాలెం పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు బడే వెంకటరమణ(59) బుధవారం మరణించారు. గ్రామంలో జరుగుతున్న ఓ కార్యక్రమంలో పాల్గొన్న వెంకటరమణ భోజనం చేస్తుండగా తీవ్రమైన గుండెపోటు వచ్చింది. ఆయన అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. గ్రామస్తులు, వివిధ రాజకీయ పార్టీల నేతలు నివాళులర్పించారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం

మచిలీపట్నంటౌన్: హైదరాబాద్‌కు చెందిన మాదిరెడ్డి జగన్నాథరావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మచిలీపట్నానికి చెందిన బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థిని ఐనాల హరిణికి బుధవారం రూ. 25 వేల ఆర్థిక సాయం అందజేశారు. ట్రస్ట్ ప్రతినిధులు నాయిని లక్ష్మణ గాంధీ, ఇమ్మనేని కృష్ణప్రసాద్, విద్యార్థిని హరిణికి మచిలీపట్నంలో చెక్కును అందజేశారు. మంచి మార్కులు సాధించే పేద విద్యార్థులకు తమ ట్రస్ట్ ద్వారా సాయం చేస్తామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో అంకాల తాతబాబు, వందంశెట్టి రాము, మాదిరెడ్డి వీరబాబు, రమేష్, మహేష్ పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయులకు శిక్షణ తరగతులు

గూడూరు: మండలంలో 2024–25 విద్యా సంవత్సరానికి పాఠశాల అభివృద్ధి ప్రణాళిక, ఆవాస ప్రాంత విద్యా ప్రణాళిక రూపొందించడంపై బుధవారం గూడూరులోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారులు బి.ఎస్.సి.శేఖర్‌సింగ్, పి.సుబ్రహ్మణ్యంఆధ్వర్యంలో జరిగిన తరగతుల్లో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు. పేరెంట్స్ కమిటీ సభ్యుల సూచనలు, సలహాలను పరిగణలోకి తీసుకుని పాఠశాల అభివృద్ధి ప్రణాళిక రూపొందించాలని సూచించారు.

పేదల అభ్యున్నతే జగనన్న లక్ష్యం

మచిలీపట్నంటౌన్: రాష్ట్రంలో పేద, బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) చెప్పారు. మచిలీపట్నంలోని 10, 12 డివిజన్లలో బుధవారం ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మతో కలిసి పేర్ని కిట్టు హాజరయ్యారు. ఈ రెండు డివిజన్లలో లబ్ధిదారులతో సమావేశాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పేదల అభ్యున్నతికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పరితపిస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి పలు సంక్షేమ పథకాలను రూపొందించి అమలుచేస్తూ పేదలను ఆదుకుంటున్నారన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలను అమలుచేస్తుంటే విమర్శిస్తున్న టీడీపీ నాయకులు వచ్చే ఎన్నికల్లో వారు కూడా సంక్షేమ పథకాలు అందిస్తామని నమ్మబలుకుతున్నారన్నారు. వారి మాటలను నమ్మవద్దని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో జగనన్ననే ముఖ్యమంత్రి చేసుకుంటే సంక్షేమ పథకాల అమలుతో పాటు రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. మేయర్ వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ గత ఎన్నికల ముందు ఒక్క అవకాశం ఇవ్వాలని అడిగిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అదే రీతిలో ప్రజలకు సంక్షేమ పాలన అందిస్తున్నారన్నారు. ఇచ్చిన హామీలు తప్పకుండా అమలు చేశారన్నారు. ఇలాంటి మనసున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ఎన్నుకోవాల్సిన అవసరం ప్రజలకు ఎంతైనా ఉందన్నారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించి ఆయా డివిజన్లలో జరిగిన అభివృద్ధికి సంబంధించిన బోర్డును ఆవిష్కరించారు. సమావేశాల్లో డెప్యూటీ మేయర్లు మాడపాటి విజయలక్ష్మి, శీలం భారతి, 10, 12 డివిజన్ల కార్పొరేటర్లు షేక్ ముంతాజ్‌బేగం, తంటిపూడి కవిత, మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, వైఎస్సార్ సీపీ నగర కన్వీనర్లు మేకల సుబ్బన్న, గూడవల్లి నాగరాజు, కాగిత జవహర్‌లాల్, మహమ్మద్ రఫీ, అర్బన్ బ్యాంక్ చైర్మన్ పల్లపోతు సుబ్రహ్మణ్యం, కార్పొరేటర్లు రాసంశెట్టి వాణిశ్రీ, మిరియాల బసవపూర్ణమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు బందెల థామస్‌నోబుల్, షేక్ మొహమ్మద్ బాషా, కేడీసీసీబీ డైరెక్టర్ గడిదేశి బాలజేసు, కో–ఆప్షన్ సభ్యురాలు మట్టా తులసి పాల్గొన్నారు.




10వ డివిజన్‌లోని అభివృద్ధి వివరాల బోర్డును ఆవిష్కరిస్తున్న పేర్ని కిట్టు, మేయర్ వెంకటేశ్వరమ్మ : అభివృద్ధిని వివరిస్తున్న పార్టీ నాయకులు

జగన్ పాలనపై నిరుపేదల్లో సంతృప్తి

చల్లపల్లి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనపై నిరుపేదల్లో సంతృప్తి స్పష్టంగా కనిపిస్తోందని వైఎస్సార్ సీపీ చల్లపల్లి మండల అధ్యక్షుడు శీరం వెంకట సత్యనారాయణ (నానీ) అన్నారు. బుధవారం సాయంత్రం చల్లపల్లి మండలం యార్లగడ్డలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సచివాలయం వద్ద సర్పంచ్ యార్లగడ్డ హేమాంజనేయ ప్రసాద్ సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరించారు. గ్రామంలో పార్టీ పతాకాన్ని శీరం నాని ఆవిష్కరించారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ మేనిఫెస్టో, వైఎస్సార్ సీపీ మేనిఫెస్టో చూపించి ప్రజల అభిప్రాయాలను సేకరించారు. టీడీపీ మేనిఫెస్టో హామీలను ఒక్కటి కూడా అమలు చేయలేదని, వైఎస్సార్ సీపీ దాదాపు 96 శాతం హామీలు అమలు చేసిందని వివరించారు.



యార్లగడ్డలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేస్తున్న మండల అధ్యక్షుడు శీరం నాని

కార్యక్రమంలో ఎంపీటీసీ కర్రా రవి, పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు బొందలపాటి లక్ష్మి, జేసీఎస్ మండల కన్వీనర్ యడ్ల జగదీష్, ఫుడ్ కమిటీ సభ్యుడు కోటేశ్వరరావు, ఏఎంసీ డైరెక్టర్ ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న వెంటే ప్రజలు

అడపావారిపాలెం(మోపిదేవి): జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలతో పేద ప్రజల జీవన విధానంలో మార్పు వచ్చిందని ఎంపీడీవో శ్రీనివాసరావు అన్నారు. మండల పరిధిలోని అడపావారిపాలెం గ్రామ సచివాలయం వద్ద బుధవారం సాయంత్రం పల్లెకు పోదాం, ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమం నిర్వహించారు. తొలుత సచివాలయం వద్ద డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధిని వివరించారు. ఇంకా గ్రామంలో సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తామని వివరించారు. అనంతరం వైఎస్సార్ సీపీ నాయకులతో ర్యాలీగా వెళ్లి ప్రధాన సెంటర్‌లో పార్టీ జెండాను మండల పార్టీ కన్వీనర్ గరికిపాటి వెంకటేశ్వరావు ఎగురవేశారు. గ్రామంలో ఇంటింటా తిరిగి బుక్‌లెట్ అందించి గత ప్రభుత్వం, మన జగనన్న ప్రభుత్వం ఇచ్చిన హామీలు–అమలును ప్రజలకు వివరించి వారి అభిప్రాయం అడిగి తెలుసుకున్నారు. రాత్రికి మండల పార్టీ నాయకులు గ్రామంలో బస చేశారు. పీఏసీఎస్ చైర్‌పర్సన్ పండలనేని అన్నపూర్ణ, పండలనేని శివప్రసాద్, మండల సచివాలయ కన్వీనర్ కోసూరు శివనాగ మల్లేశ్వరావు, రెడ్రౌతు రాంప్రసాద్, ఎస్సీసెల్ మండల కన్వీనర్ చోడాబత్తిన పూర్ణచంద్రరావు, సచివాలయ ఉద్యోగులు, గ్రామ కార్యదర్శి రాజేంద్రప్రసాద్, వలంటీర్లు, పార్టీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు బానిస కావద్దు

బందరు డీఎస్పీ మాధవరెడ్డి



కృత్తివెన్ను: యువత మాదకద్రవ్యాలకు బానిస కావద్దని బందరు డీఎస్పీ మాధవరెడ్డి అన్నారు. ఆయన కృత్తివెన్ను పోలీస్‌స్టేషన్‌ను బుధవారం వార్షిక తనిఖీలో భాగంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన స్టేషన్‌లో పెండింగ్‌లో ఉన్న కేసుల రికార్డులను, స్టేషన్ పనితీరును పరిశీలించారు. సీడీ ఫైల్స్, క్రైం రికార్డులు పరిశీలించినట్లు వివరించారు. సమస్యే తమ దృష్టికి తీసుకువస్తే చట్టపరిధిలో వాటిని పరిష్కరిస్తామని ఆయన తెలిపారు. స్టేషన్‌లోని కొన్ని ముఖ్యమైన కేసులను స్పీడ్ ట్రయల్ చేయనున్నట్లు వివరించారు. యువత దుర్వ్యసనాలకు బానిస కాకుండా తల్లితండ్రులు గమనిస్తూ ఉండాలని సూచించారు. నేరచరిత్ర ప్రకారం కేసులు నమోదు చేయడం, పీడీయాక్ట్ పరిశీలన ఉంటుందన్నారు. ఇటువంటి వాటిపై డయల్ 100కు లేదా స్టేషన్ ఎస్‌ఐకు సమాచారం ఇవ్వాలన్నారు. పరిశీలనలో బందరు రూరల్ సీఐ హబీబ్‌బాషా, ఎస్‌ఐ గణేష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పైప్‌లైన్ పనులు ప్రారంభం



కోనేరుసెంటర్: మండలంలోని మారుమూల గ్రామాలకు సైతం తాగునీటి సమస్య తలెత్తకుండా ఉండటానికి జలజీవన్‌మిషన్ స్కీం ద్వారా పైపులైన్ నిర్మాణ పనులు చేపడుతున్నట్లు వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ పేర్ని కిట్టు తెలిపారు. పెద్దకరగ్రహారంలో జల్‌జీవన్‌మిషన్ స్కీం కింద రూ. 1.18 కోట్ల వ్యయంతో నిర్మించనున్న పైపులైన్ విస్తరణ పనులను బుధవారం కిట్టు ప్రారంభించారు. మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, డెప్యూటీ మేయర్ మాడపాటి విజయలక్ష్మి, పార్టీ నియోజకవర్గ కన్వీనర్ శొంఠి ఫరీద్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కేడీసీసీబీ సేవలు వినియోగించుకోండి



చల్లపల్లి: కేడీసీసీ బ్యాంక్ సేవలు వినియోగించుకోవాలని మంగళాపురం సర్పంచ్ డొక్కు నాగేశ్వరరావు కోరారు. మంగళాపురం పీఏసీఎస్ వద్ద బుధవారం కేడీసీసీ బ్యాంక్ ఆధ్వర్యంలో నాబార్డు సౌజన్యంతో డిజిటల్ ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమం నిర్వహించారు. కళాకారులు కేడీసీసీ బ్యాంకు ఖాతా ద్వారా పీఎం జీవన్ జ్యోతి బీమా, పీఎం సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, కిసాన్ క్రెడిట్ కార్డ్, ఇత్యాధి ప్రయోజనాలపై అవగాహన కలిగించారు. కార్యక్రమాల్లో మంగళాపురం పీఏసీఎస్ చైర్మన్ పేరం నాగిరెడ్డి, కమలాకరరావు పాల్గొన్నారు.

దళారుల మాటలు నమ్మొద్దు



పెదప్రోలులో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ రాంబాబు

పెదప్రోలు(మోపిదేవి): దళారుల మాటలు నమ్మొద్దని పీఏసీఎస్ చైర్మన్ ఆది రాంబాబు అన్నారు. మండల పరిధిలోని పెదప్రోలులో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ 2023–24లో ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు రైతుభరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తుందన్నారు. క్వింటాలు(100) కిలోలకు గ్రేడు ఎ రకం రూ. 2,203, సాధారణ రకం రూ. 2,183, 75 కిలోల బస్తాకు గ్రేడ్ ఎ రకం రూ. 1,652, సాధారణ రకం రూ. 1,637గా ధర నిర్ణయించి కొనుగోలు ప్రారంభించినట్లు తెలిపారు. ధాన్యం విక్రయించిన 21 రోజుల్లోపు రైతు బ్యాంకు ఖాతాలో నగదు నేరుగా జమవుతుందని తెలిపారు. రైతు భరోసా కేంద్రాలు నిర్దేశించిన నాణ్యతా ఫలితాలను మాత్రమే పరిగణిస్తాయని, రైస్ మిల్లర్ల అభ్యంతరాలు పరిగణలోకి తీసుకోరని ప్రభుత్వం స్పష్టం చేసిందన్నారు. ఒకవేళ రైతే గోనె సంచులు, హమాలీలు, రవాణా ఏర్పాట్లు చేసుకుంటే, ప్రభుత్వ లెక్కల ప్రకారం ఆ పైకం నేరుగా రైతు ఖాతాలోకి ధాన్యం సొమ్ముతో సహా 21 రోజుల్లో చెల్లిస్తారని వివరించారు. ఆర్బీకేలో 5 వేలకు పైగా గోనె సంచులు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. వరికోత కోసే రైతులు ముందుగా ఆర్బీకేలో తెలియజేయాలని, అనుమానాలు ఉంటే అధికారులు నివృత్తి చేస్తారని వివరించారు. అసిస్టెంట్ రిజిస్ట్రార్, మండల ఇన్‌చార్జి కె. లీల, కార్యదర్శి మార్గాని నాగమణి, గ్రామ పార్టీ కన్వీనర్ జన్యావులు రామమోహనరావు, రైతులు యడ్లపల్లి సాంబశివరావు, యన్నం రాంబాబు, గౌరం శ్రీనివాసరావు, వీఏఏ గౌరిపర్తి తేజశ్రీ పాల్గొన్నారు.

రెచ్చగొట్టే రాజకీయాలు మానుకోవాలి

బుద్ధప్రసాద్‌కు ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు హితవు



సభలో మాట్లాడుతున్న అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

కోడూరు: మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ రెచ్చగొట్టే రాజకీయాలను మానుకోవాలని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు హితవు పలికారు. కోడూరులో బుధవారం మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్ శంకుస్థాపన కార్యక్రమాన్ని పురస్కరించుకొని నిర్వహించిన సభలో బుద్ధప్రసాద్ తీరుపై రమేష్ బాబు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బుద్ధప్రసాద్‌కు ఎమ్మెల్యే టికెట్ వస్తుందో లేదో అనుమానంతో ఇష్టానుసారం మాట్లాడుతున్నారన్నారు. నాలుగున్నర ఏళ్ల నుంచి నియోజకవర్గంలో కనిపించకుండా ఎన్నికలు సమీపిస్తుండటంతో వచ్చి హడావుడి చేయడం పరిపాటిగా మారిందని రమేష్‌బాబు విమర్శించారు. బుద్ధప్రసాద్ కారుల్లో విజయవాడ, హైదరాబాద్ తిరగడం తప్ప నియోజకవర్గ ప్రజలకు చేసిందేమి లేదని ఎద్దేవా చేశారు. 22ఏ నిషేధిత భూముల సమస్యను పరిష్కరించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని, ఈ సమస్య పరిష్కారమైన తర్వాత కూడా బుద్ధప్రసాద్ దీన్ని రాజకీయం చేయాలని చూసి విఫలమయ్యారన్నారు. బుద్ధప్రసాద్ అవనిగడ్డ నియోజకవర్గంలో జనసేన, వైఎస్సార్ సీపీ మధ్య తగవు పెట్టాలని చేస్తున్నారని, జనసేన పార్టీ నేతలను, కార్యకర్తలను రెచ్చగొట్టి తాను పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారని రమేష్‌బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. జనసేన నేతలు సొంతపార్టీ నేతలపై విమర్శలు చేసుకొనే స్థాయికి దిగజారారన్నారు. కోడూరు మండలంలో సుమారు రూ.257కోట్ల నగదు వివిధ పథకాల ద్వారా ప్రజల ఖాతాల్లో జమ చేశారని ఇంతంతా అభివృద్ధి కాదా అని ప్రశ్నించారు. ఎంపీ వల్లభనేని బాలశౌరి, దివి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఆక్వాకల్చర్‌లో యాంటీ బయోటిక్స్‌ను తగ్గించాలి

నాక్సా సీఈఓ మనోజ్‌కుమార్

కోడూరు: ఆక్వాకల్చర్‌లో రైతులు యాంటీ బయోటిక్స్ వినియోగాన్ని తగ్గించాలని నాక్సా సీఈఓ టి.జె.మనోజ్‌కుమార్ అన్నారు. ఎంపెడా, నేషనల్ సెంటర్ ఫర్ సస్టైనబుల్ ఆక్వాకల్చర్ (నాక్సా) సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం మందపాకలలో యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఏఎంఆర్)పై ఆక్వా రైతులకు అవగాహన కల్పించారు. చేపలతో పాటు సముద్ర జీవుల్లో వ్యాధుల నివారణకు, చికిత్స చేయడానికి యాంటీబయోటిక్స్‌ను విస్తృతంగా వినియోగిస్తున్నారని మనోజ్ కుమార్ అన్నారు. దీన్ని నిరోధించడానికి రైతుల్లో చైతన్యం పెరగాలన్నారు. బయోసెక్యూరిటీ చర్యలు, మెరుగైన నీటి నాణ్యతను పాటిస్తే ఆక్వా సాగు లాభసాటిగా ఉంటుందన్నారు. తీరప్రాంత జిల్లాల్లో 16 ప్రచార సదస్సులు నిర్వహిస్తామని, ఇందులో పది సదస్సులు మన రాష్ట్రంలోనే జరగనున్నట్లు మనోజ్ కుమార్ తెలిపారు. నాక్సా, ఎంపెడా ఆధ్వర్యంలో ఆక్వా రైతులకు అందిస్తున్న సబ్సిడీలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచి అద్దంకి శివప్రసాద్, ఎంపెడా డెప్యూటీ డైరెక్టర్ కె.శివరాజు, కేయూ ప్రొఫెసర్ సీహెచ్ సురేష్‌బాబు, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ ఎం.సుధారాణి, సీఏఏ ఎం.రాంప్రసాద్, ఏడీఏ ఆర్.ప్రతిభ, ఎఫ్‌డీఓ వానపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.



జ్యోతిప్రజ్వలన చేస్తున్న సీఈఓ మనోజ్‌కుమార్

సాఫ్ట్‌బాల్ పోటీలకు శ్రీకాకుళం జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని

ఘంటసాల(అవనిగడ్డ): ఘంటసాల మండలం శ్రీకాకుళం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన పైడిపాముల అక్షయ జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్టు హెచ్ఎం అమ్మిరెడ్డి అనుపల్లవి భువనేశ్వరి తెలిపారు. స్థానిక హైస్కూల్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో అక్షయ, తండ్రి ఆనంద్‌ను ఎంపీడీవో చినరాట్నాలు, సర్పంచ్ రవిప్రసాద్, హెచ్ఎం అభినందించారు. వ్యాయామ ఉపాధ్యాయుడు వెంకటేశ్వరరావు, పేరెంట్స్ కమిటీచైర్మన్ సుధీర్, ఎంపీటీసీ చిన్నా తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పవిత్రోత్సవాలు

బంటుమిల్లి: పాశ్చాపురంలోని శ్రీసువర్చలాంజనేయస్వామి వార్షిక పవిత్రోత్సవాలు బుధవారం నుంచి వైభవంగా ప్రారంభమయ్యాయి. రొంపిచర్ల హనుమంతాచార్యులు, పరాశరం రంగనాథాచార్యులు శిష్యబృందం వేదమంత్రాల మధ్య వాస్తు పూజ, అంకురారోపణ, నవగ్రహ హోమాలు పలువురు దంపతుల దీక్షాధారుల మధ్య ప్రారంభమయ్యాయి. ఇవి ఈ నెల 25వ తేదీ వరకు జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు.

వీరాంజనేయస్వామి విగ్రహ పునఃప్రతిష్ట



పెడన: కవిపురంలోని వీరాంజనేయస్వామి ఆలయంలో జరుగుతున్న వీరాంజనేయస్వామి విగ్రహ పునఃప్రతిష్ఠ మహోత్సవాలు బుధవారం రెండో రోజుకు చేరాయి. ఉదయం స్వామి విగ్రహానికి ఆవుపాలతో అభిషేకాలు చేశారు. అనంతరం ఉదయం, సాయంత్రం గవ్యాంగ పూజలు, మహావాస్తు శాంతి, జలాధివాసం, క్షీరాధివాసం, తదితర పూజలను ఘనంగా నిర్వహించారు. గురువారం ఉదయం విగ్రహ ప్రతిష్ఠ, మధ్యాహ్నం భారీ అన్న సమారాధన, రాత్రికి కోటి దీపోత్సవం కార్యక్రమాలుంటాయని కవిపురం పీఏసీఎస్ అధ్యక్షుడు తిక్కిశెట్టివెంకట సీతారామప్రసాద్ బాబు అన్నారు. మహోత్సవాలను కటకం శ్రీరాములు, వీరకళావతి, పుప్పాల మాధవరావు, వీరరాఘవమ్మ దంపతులతో వేదపండితులు గూడూరు రామకృష్ణశర్మ హోమాలు, ప్రత్యేక పూజలు చేయిస్తున్నారని వివరించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు గూడూరు విద్యార్థి



గూడూరు: నరసరావుపేటలో ఈనెల 23నుంచి జరగనున్న రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్‌కు గూడూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి ఊసా హర్షవర్ధన్ ఎంపికయ్యాడు. అండర్–14 హై జంప్ విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనపర్చిన హర్షవర్ధన్ కృష్ణాజిల్లా తరఫున రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాడని పాఠశాల ప్రధానోపాధ్యాయని డి.పుష్పలత తెలిపారు. తొమ్మిదో తరగతి విద్యార్థి హర్షవర్ధన్ రాష్ట్ర స్థాయిలో పతకం సాధించాలని ఆకాంక్షించారు. పీడీలు ఎం.అరుణ, రాజేష్ ప్రసన్న, పేరెంట్స్ కమిటీ చైర్మన్ కొల్లు వాసు, తదితరులు అభినందించారు.

బీఎల్వోలు పారదర్శకంగా వ్యవహరించాలి

గూడూరు: బీఎల్వోలు పారదర్శకంగా వ్యవహరించాలని గూడూరు తహసీల్దారు బి.విజయప్రసాద్ స్పష్టం చేశారు. గూడూరులోని తహసీల్దారు కార్యాలయంలో బుధవారం ఓటరు నమోదులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బీఎల్వోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. తహసీల్దారు మాట్లాడుతూ బూత్ స్థాయిలో 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడానికి యువతలో చైతన్యం తీసుకురావాలని కోరారు. ఓటు గుర్తింపు కార్డుల్లో సవరణలకు, తొలగింపులకు వచ్చే అర్జీలపై ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా నిష్పక్షపాత విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.

కళాకారుడు నాగేంద్రకు సత్కారం

అవనిగడ్డ: పంచాయితీ పరిధిలోని నేరెళ్లపాలెంలో జరిగిన సూరగం రామచంద్రరావు 11వ వర్ధంతిని పురస్కరించుకుని గుడ్లవల్లేరుకు చెందిన కళాకారుడు నాగేంద్రను ఘనంగా సత్కరించారు. దివిసీమకు చెందిన ప్రముఖ కళాకారుడు పుప్పాల వీరాంజనేయులు రామచంద్రరావు దంపతుల విగ్రహాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు జగన్మోహనరావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నగరానికి ఉత్సవ శోభ

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం.. పాండురంగస్వామి ఉత్సవ శోభను సంతరించుకుంది. బుధవారం నుంచి స్వామివారి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఆలయ పరిసరాలతో పాటు నగరంలోని పలు కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన రంగురంగుల విద్యుత్‌దీపాల అలంకరణలు ఆకట్టుకుంటున్నాయి. ఆలయ మార్గం వద్ద విద్యుత్‌దీపాలతో పాండురంగడి, వేంకటేశ్వర స్వామి ప్రతిమలను ఏర్పాటుచేశారు. పాండురంగడికి మేయర్ వెంకటేశ్వరమ్మ, పేర్ని కిట్టు పట్టువస్త్రాలు సమర్పించారు. గురువారం ఆలయంలో సత్యనారాయణస్వామి వ్రతం, బ్రహ్మోత్సవం, రాత్రి 7గంటలకు శ్రీ రుక్మిణీ పాండురంగస్వామి కల్యాణం జరగనుంది.



పాండురంగడికి పట్టు వస్త్రాలు తీసుకెళ్తున్న మేయర్ వెంకటేశ్వరమ్మ, పేర్ని కిట్టు తదితరులు



ఆలయం వద్ద ఏర్పాటు చేసిన స్వాగతద్వారం



నగరంలోని లక్ష్మీటాకీసు సెంటరులో విద్యుత్‌దీపాలంకరణ